పోయి సినిమాలు చూసొస్తున్నారు. టెర్లిన్లుకొని డ్రస్సులు వేసుకొంటున్నారు. ట్రాన్సిస్టర్లు కొంటున్నారు. ఆ ఆదిమ వాసుల సంఘ జీవితంలో డబ్బు ప్రవేశించింది - మన తాలూకు కుళ్ళు కూడా వెంటనే చేరింది, అవును - నిజమే వాళ్ళను మనంత వాళ్ళను చేసికాని మనం వదలం అని దృఢ ప్రతిజ్ఞ చేశాం కదా!

అన్నట్టు అరకులో వుండగా పెరట్లో పెద్ద కూతురిలా నిలువెత్తు పెంచిన మన గులాబిచెట్టు, ఇప్పుడు ఎవరి దొడ్లో పూలూ పూస్తోందో?

గోడ మూల నక్కినట్లు పొంచి దొంగ చూపులు చూసే మందార మొక్కను ఎవరూ పీకి పారెయ్యలేదుకదా; దాని పక్కనే వేశాను చిన్న మల్లి పందరి - ఎవరూ నీళ్ళు పోయకపోతే బెంగటిల్లి అది ఎండి పోయిందేమో... ఆఫీసు ఎదురు గుండా వేసిన యూకలిప్టస్ చెట్లు ఈ పాటికి ఎంత ఎత్తు ఎదిగి ఉంటాయి చెప్మా... రోకలి బండలా చప్పుడు చేసుకుంటూ వచ్చే రైలు దాని పరుగులిడే చక్రాలకు అట్టడుగునించి ప్రవహించే జీవితవాహిని ఎన్నడైనా గుర్తుంటుందా?

అరకు రైల్వేస్టేషన్లో బండి ఆగి బయల్దేరే ముందు కూత వేసినపుడు - అది మీ కందరికీ జయ జయ ధ్వానాలు తెలుపుతోందని గ్రహించాలి;

ఆ సొరంగాల గుండా ప్రయాణం చేసే రైల్లో సుఖంగా కూర్చున్న పెద్ద మనుష్యులు వారు అలా సౌకర్యంగా ప్రయాణం చేయడం కోసం కష్టపడిన ఎన్నో వేలమంది మీబోటివాళ్ళు ఆ రైలు ఎక్కకుండానే తలవంచుకుని సెలవంటూ తమతమ సెలవులకి వెళ్ళి పోయారని గుర్తుంచుకుంటే చాలు;

కాని తీరికూర్చుని ఎవరు సుఖమైన వేళల్లో కష్టజీవుల్ని జ్ఞాపకం చేసుకుంటారు? చేసుకోకూడదు. దరిద్రులమీంచి కష్టజీవుల మీంచి డబ్బుఖర్చు రైల్వేవాళ్లు రైలును నడిపించేస్తారు.

సుఖపడేవాళ్ళు, కాకాగాళ్ళూ రైల్లో కూర్చుని ప్రయాణాలు చేస్తారు.

తెలివితక్కువ వాళ్ళు దాని నిర్మాణంలో పని చేస్తారు. అందుకే మిమ్మల్నెవరూ చిన్న సైజు హీరో అయినా రైలెక్కండి రండి అని పిలవలేదు. అరకువేలీ మిమ్మల్ని మర్చిపోయింది.

సో వెరీసారీ అండీ.

# రంగుల డేరా

"జూ"లో కటకటాల వెనుక జంతువుల్ని చూస్తూంటే కట కటా ఇష్టంలేకుండా కాపరాల కెళ్ళిన అమ్మాయిలు గుర్తుకొస్తారు నాకు.

అహ; సర్కస్‌లో అలాక్కాదు.

బ్యాండు వాయిస్తోంటే, టికెట్టు కొన్న అన్ని వేల జతల కళ్ళ ముందు అర్ధనగ్నంగా తొడలాగులు, బాడీలు వేసుకుని రబ్బరు బంతుల్లా ఎగురు కుంటూ గంతులు వేసే ఆడపిల్లలు -

ఒంటి చక్రంపై సైకిలు తొక్కుతూంటే.

తీగమీద నడిస్తే;

ఉయ్యాల ఫీట్లు చేస్తోంటే.

ఆ రంగు రంగుల లైట్లకాంతిలో జిగేల్ - జిగేల్ మని మెరిసి పోతూ దిగివచ్చిన దేవ కన్యల్లా చూడ్డానికి ఎంతో బావుంటారు వాళ్ళు;

ఆ కారణంగా రోజూ ఆ తీగమీద మగవాడు ఆ అర్ధనగ్న సుందరిమీద ఎన్నో కత్తులు విసురుతున్నట్లు చూస్తారు.

ఎవరికీ కత్తులు గుచ్చుకోకూడదు

గుచ్చుకోవాలని ఏ పాపాత్ముడూ కోరడు.

ఆ తీగమీద నడిచే అందాల బాల పడిపోకూడదు.

పడిపోకూడదు.

రక్షించు దేవుడా; రక్షించు.

అంత అందమైన అమ్మాయి కాలు జారిపడి నెత్తుటి మడుగులో పొర్లాడ్డం నేన్చూడలేను. చూడలేను.

అందుకని ఏ అమ్మాయి కాల్జారకూడదు

ఎవరి పీకా తెగిపోకూడదు. ఏ సంసారం చల్లారకూడదు

తండ్రీ అందరూ చల్లగా వుండాలి;

బాబూ అందరూ బాగుండాలి;

నాయనా అంతా కుశలమే కదా;

లోకం పులి నోట్లో తల దూర్చిన మగాడు తలను పైకి తీసుకోగలడో లేడో....

అసలు కలండనెడువాడు కలడో లేడో... మన జీవితాలను బోనులో పెట్టి వీలయినపుడల్లా ఆడించే ఆ రింగ్‌మేస్టరు కలడో లేడో,

అన్నీ సందేహాలే; అన్నీ ఆశ్చర్యార్థకాలే;

ఆఫీసులో పనులైపోయాక విలన్ చేత చావుదెబ్బలు తిన్న హీరోలా ఇంటి కొచ్చే మొగాళ్ళు జీవితం పులి నోట్లోంచి తలకాయ బయటికి తీస్తారా అనిపిస్తోంది.

ఎప్పుడో కటిక్కిన కొరికేస్తుంది పులి

ఎప్పుడో దబిక్కిన జారి పడుతుంది తీగ మీంచి పిల్ల.

ఎప్పుడో విసిరిన కత్తి ఎక్కడో గుచ్చు కొంటుంది అందంగా నిలబడ్డ అర్ధనగ్న సుందరికి

ఎప్పుడో సింహాలు, పెద్దపులులు తిరగ బడి కటకటాల్ని దూకి, కటకటా ఆడియన్స్ లోకి వచ్చి మనం మనం ఒకటే అని కలిసిపోతాయి.

చివరి వరకూ విలన్ చేతిలో చావుదెబ్బలు తిన్నా చిట్టచివరకు హీరోయే నెగ్గుతాడు.

కాని, ఎప్పుడో విలన్ చేతిలో హీరోయే చస్తాడు

నూరు సినిమాల్లో యాక్టు చేసిన వాడైనా ఒక్క సినిమాలో దెబ్బ తింటాడు.

పది మందిని నవ్వించిన హాస్యనటుడు లేదా సర్కస్‌లో బఫూన్ - ముల్లు గుచ్చుకుంటే ఏడుస్తాడు.

పులి నోట్లో తలకాయ దూర్చిన ఆసామీ పెళ్ళాం కేసి చూడ్డానికి భయపడతాడు.

గజీతగాడికి అల్లుడ్ని చూస్తే భయం;

సర్కస్‌లో మన కళ్ళముందు అర్ధనగ్నంగా తిరిగిన అమ్మాయిల్ని డేరాల్లో వొళ్ళంతా బట్ట కప్పుకుని చీరల్లో వుండటం చూసి ఆశ్చర్యపోయాను.

అప్పుడు వాళ్లు చాలా దీనంగా రాక్షసుల చేతుల్లో ఓడిపోయిన దేవతల్లా మంచి రోజుల కోసం ఎదురు చూస్తున్న మానవులవలె అగపడ్డారు.

ఎందుకో సర్కస్ కంపెనీ వాళ్ళంటే నాకు చాలా ఇష్టం;

సర్కస్ కంపెనీ వాళ్ళు వచ్చి వూళ్ళో కాళీ జాగాలో డేరాలు వేసుకోగానే మా పిల్లల మనసుల్లో రంగు రంగుల డేరాలు ఎవరో వేసినట్లుండేది.

కన్నెపిల్ల మనసులో పెళ్ళయాక జీవితమంటే ఎన్నెన్ని రంగుల డేరాలు వెలుస్తాయో?

ఆ డేరాలో తన చేత సర్కస్ ఫీట్లు చేయించే పురుషుడు ఆ రింగ్ మేస్టరు ఎలాటి వాడొస్తాడో...

ఆ రంగుల డేరా వర్షంలో తడిసిపోయి గాలికెగిరిపోతుందో. వెన్నెలలో కరిగి కరిగి కన్నులలో వెలిగి వెలిగి... చీకట్లో రంగురంగుల దీపాల కాంతిలో జీవితాన్ని జగజ్జేగీయమానం చేస్తుందో ఎవరికి తెలుసు? ఎవరు చెప్పగలరు?

ఒంటినిండా ఫుల్ వాయిల్ చీరకట్టుకుని సూటేసుకున్న మొగుడి పక్కని కూర్చుని సర్కస్ చూసే జెంటిల్మానుగారి భార్యకు ఒక చెంపను సౌందర్యం ఒలకపోస్తూ వేరొక చెంపను సాహసంవిరజిమ్మే తీగమీద సైకిలు తొక్కే అర్ధనగ్న సుందరిని చూస్తే ఏమనిపిస్తుందో.

ఎవరికి తెలుసు? వొళ్ళు మండుతుందో ఏమో....

నా మటుకు నాకు - కింగ్ జార్జి ఫిఫ్త్ కంటె, లెక్కల మాస్టారికంటె, ఎలిజిబెత్ రాణికంటె మంత్రసాని మరదలు కంటె - అశోకుని కంటె అప్పారావు బస్సు డ్రయివరు కంటె జవహర్లాల్ నెహ్రూ కంటె - ఆఖరికి మావూరి హెడ్ కానిస్టేబులు వెంకటస్వామికంటె కూడా సర్కస్‌లో రింగ్ మాస్టరంటేనే చెడ్డగౌరవం;

కాని డేరాలు ఎత్తేసుకుని ఆ లైట్లన్నీ పీకేసుకుని ఏనుగుల్ని, లొట్టిపిట్టల్నీ కుక్కల్ని, గుఱ్ఱాల్ని తీసుకుని వాళ్ళు వూరు వదలివెళ్ళి పోతుంటే - మాచెడ్డ దిగులుగా వుండేది.

అంతమందీ సుందరీమణులు అందరు యువకులు, అన్ని జంతువులూ, మృగాలూ మనకోసం వచ్చి మనల్ని ఆనందపరచి సెలవంటూ వెళ్ళిపోయాక ఆ కాళీజాగా కేసి చూస్తే భయంకరంగా ఎంతో బాధగా కూడా వుంటుంది.

రంగుల డేరా ఎత్తేశాక ఆ ఖాళీ మైదానాన్ని చూడటమంటే సముద్రం ఎండిపోయాక దిగంతాల వరకూ వ్యాపించే అఖండమైన ఆ ఇసుక పర్రనుచూస్తే ఎటువంటి భీతి కలుగుతుందో అటువంటి భావం మనసులో మెదలుతుంది.

గారడీవాడు తమాషాలు చేసి వెళ్ళిపోతూంటే. అప్పుడే అయిపోయిందా అనిపించేస్తుంది.

సర్కస్‌డేరాలు ఎత్తేశాక ఆ మైదానం పెళ్ళి పందిళ్లు తీశాక వెలవెలబోతున్న పెళ్ళయిన ఇల్లులా వెలితిగా వుంటుంది.

కొన్నాళ్ళయాక ఆ వెలితికి అలవాటు పడిపోతారు. అప్పుడు కన్నెపిల్లమనసులో రంగుల డేరా వెలిసినట్లు ఆ సంగతి మనసుని హత్తుకుని పోయి మళ్లీ సర్కస్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తే రాగానే సంబరపడి పోతాము.

హరికథలకి, పాట కచేరీలకి వెళ్ళే వాళ్ళ కంటె సర్కస్‌కి వెళ్ళే వాళ్ళంటేనే నాకు ఎక్కువ ఇష్టం.

అబ్బ; రంగులడేరాని నా జన్మలో మర్చిపోలేను.

ఏమండోయ్ శ్రీవారూ ఒక చిన్నమాట;

మన సంసారం ఒక చిన్న రంగుల డేరా అయితే అందులో రింగ్ మేస్టరు మీరు కత్తులు నా మీద విసురుతారు.

మన పిల్లలు జంతువులు. మన పాలవాడు, పనిమనిషి కోతులు, చింపాజీనూ – మన ఇంటి వాళ్ళు ఏనుగులు, మీ ఆఫీసువాళ్ళు పెద్ద పులులూ, సింహాలూనూ, మాచెల్లెళ్ళు సర్కస్ కన్యలైతే మీ తమ్ముళ్ళు బఫూనులు –

"అయితే హిపో పోటోమస్ ఎవరూ –"

అమ్మబాబోయ్ ఛంపేస్తారు నేను చెప్పను గాకచెప్పను;

# ఐ లైకిట్

మాంఛి ఎండలో ఐస్ వేసిన మామిడికాయ ముక్కలు తిని సర్బత్ తాగాలనుంటుంది. (ఎవరింటికేనా వెళ్తే కుంపటి వెలిగించి కాఫీ పెట్టి ఇస్తారు తెలుగువాళ్ళు) వర్షంలో ఏం చేయాలనుంటుంది?

వర్షం కురుస్తూంటే మొక్కజొన్న పొత్తులు కాల్చేచోట రిక్షాను ఆపుచేసి వేడి వేడి పొత్తులు రెండు మూడు కాల్పించుకుని అవి తింటూ కబుర్లు చెప్పుకుంటూ సినిమాహాలు దాకా వెళ్తే ఆ తరువాత సహజంగా సినిమా అట్టే బాగులేక పోయినా ఫరవాలేదు.

ఇంటర్వెల్లో మళ్ళీ సోడావేసి నిమ్మకాయ రసం పిండిన మిరప కాయ బజ్జీలు కొరుక్కు తింటుంటే నెత్తిమీద చినుకులు పడుతున్నా తెలీదు. ఆఘాటు అటువంటిది.

ఏపని చేయడానికైనా సమయాలున్నాయి ఆ సమయాలు పాటిస్తే జీవితం ఎంతో అద్భుతంగా వున్నట్లనిపిస్తుంది.